# ఒకే దేవుడు, ఒకే ప్రజ

మోషే నేతృత్వంలో ఈజిప్టును విడిచిన హెబ్రీయులకు అప్పటికింకా ఇశ్రాయేలీయులనే పేరు లేదు. అబ్రాహాను మోషేను ఎన్నుకొన్న దేవుని గురించి వారికి సరైన అవగాహన లేదు. నేను ఉన్నవాడను అనువాడను అనే పేరున్న దేవుణ్ణి (హెబ్రీభాషలో యెహోవా) వారప్పటి కింకా అనుభవ పూర్వకంగా తెలుసుకోలేదు. నిర్గమ 3:13-15 కూడ చూడండి.

ఇశ్రాయేలీయులకు సీనాయి అరణ్యంలో సంచరించేటప్పుడు యెహోవా మోషేకు ధర్మశాస్త్రాన్ని యిచ్చాడు. ధర్మశాస్త్రంలోని మొట్టమొదటి ఆజ్ఞ యెహోవాయే దేవుడని ఆయనను తప్ప. వేరెవరిని ఆరాధించకూడదని తెలియజేస్తుంది. (నిర్గమ 20:1-3). ప్రాచీన పశ్చిమాసియా ప్రజలు వివిధ దేవుళ్ళను పూజిస్తున్న కాలంలో కనానులో ప్రవేశించిన ఇశ్రాయేలీయులు అద్వితీయుడు నిజదేవుడు అయిన యెహోవాను ఆరాధించి ఆయనను వెంబడించారు.

అనేక యుద్ధాలకు పోరాటాలకు సాక్ష్యంగా నిలిచిన దేశంలో ఇశ్రాయేలీయులు జీవించారు. ఈజిప్టు మెసపటోమియా కనానులను అనేకులు పరిపాలించారు. యుద్ధాలు ఇశ్రాయేలు చరిత్రలో ఒక భాగం. అయితే, భవననిర్మాణం సాహిత్యం కళలు వంటి విషయాల్లో కూడ అభివృద్ధి చెందిన యూదు ప్రజ ప్రపంచ చరిత్రలో తమకొక సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నారు. నేటికి ప్రపంచ చరిత్రలో ఇశ్రాయేలు తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని తన ఖ్యాతిని నిలుపుకునే వుంది.